క్లుప్తంగా

కూలిన పెంకుటిల్లు



కూలిన ఇంటి ఎదుట బాధితులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కంఠ కాలనీకి చెందిన ఎడ్ల పుల్లమ్మకు చెందిన పెంకుటిల్లు ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలి నేలమట్టమైంది. పుల్లమ్మతో పాటు మనవరాలు హారిక ఇంటి బయట పనులు చేస్తుండగా కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇల్లు నేల కూలడంతో ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయి. నిరుపేదలైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి మాజీ వార్డు సభ్యుడు దూడల అశోక్ నిత్యావసర సరుకుల కోసం రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రం శివారులో ఆదివారం ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, రూ. 2590 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. పేకాట, జూదం, ఆన్‌లైన్, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు ఎవరు పాల్పడినా దేశీదారు, గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఎస్సై సందీప్‌కుమార్, పీసీలు మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

జైనూర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని హరిభక్త పారాయణ్ నారాయణ్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని జామిని గ్రామంలో చంద్రయాన్ 3 విజయోత్సవం, శ్రావణ మాసంలోని పుత్రద ఏకాదశి పురస్కరించుకొని సత్సంగ, కీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువత ఒక నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని దాన్ని సాధించే వరకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, యువజన సంఘం అధ్యక్షుడు కేంద్రే పర్శరాం, సభ్యులు కేంద్రే మారుతి, సతీశ్, సంతోష్, సుధామ్, హన్మంత్‌రావు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆరె కుల సంఘం కమిటీ రద్దు

సిర్పూర్(టి): మండల ఆరె కుల సంఘం కమిటీని రద్దు చేస్తున్నట్లు మండల ఆరెకుల సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరెకుల సంఘం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్న పాత కమిటీని రద్దు చేస్తున్నామన్నారు. నూతన కమిటీ ఏర్పాటుకు త్వరలోనే తేదీ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరె కుల సంఘం నాయకులు చౌదరి నానాజి, తుస్సే దౌలత్, తుస్సే సంతోష్, బోర్కుటే రాజేందర్, శంకర్, ఎల్ములే కిషోర్, లాలాజి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పూలాజీ బాబా జయంతి పోస్టర్ ఆవిష్కరణ

జైనూర్: పూలాజీ బాబా తన హితబోధనలతో ఎంతో మంది ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపారని సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బాబా జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించే బాబా 99వ జయంతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, సంస్థాన్ కార్యదర్శి దుర్‌క్రే సుభాశ్, సర్పంచులు మెస్రం నాగోరావు, మెస్రం రాహుల్, మెస్రం గోవింద్‌రావు, డోంగ్రే ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నమూనా టెట్‌కు స్పందన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన నమూనా పరీక్షలకు స్పందన లభించింది. ముందుగా టెట్ నమూనా పరీక్ష పత్రాలను ట్రస్ట్ నిర్వాహకులు విడుదల చేశారు. అభ్యర్థులు నమూనా టెట్ పరీక్షలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కొలువులు సాధించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఆదివాసీలకే కాంగ్రెస్ టికెట్ కేటాయించాలి

నార్నూర్: కుమురం భీం (ఆసిఫాబాద్) జిల్లా నియోజకవర్గం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదివాసీలనే ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొట్నాక్ నానాజీ, జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ మెస్రం మోతీరాంలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్‌లో మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి టికెట్ కేటాయిస్తే ఊరుకోమన్నారు.

బడులపై 'విద్యుత్' భారం

- 91 ప్రభుత్వ పాఠశాలలకు రూ.22లక్షల బిల్లు
- ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలు
- కొన్ని స్కూళ్లకు మీటర్లు లేకున్నా బిల్లులు!



విద్యుత్ మీటర్ లేని దేవుడ్‌పల్లి పాఠశాల

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్లుగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలతో ప్రధానోపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రతినెలా రూ.వేలల్లో బిల్లులు వస్తుండడంతో చెల్లించేదెలా అని తలలు పట్టుకుంటున్నారు. నిధుల లేమితో ప్రభుత్వ పాఠశాలలు బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నాయి. ఇటీవల 2023 –24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు మొదటి త్రైమాసికం విద్యుత్ బకాయిలు విడుదల చేసినా స్కూళ్ల ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 91 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఐదు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఒక కేజీబీవీ, మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు 78 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 5,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఎనిమిదేళ్లుగా పెండింగ్..

మండలంలోని పాఠశాలల్లో ఎనిమిదేళ్లుగా విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖపై భారం పడుతోంది. 2014 నుంచి 2022 డిసెంబర్ 31 వరకు మొత్తం రూ.22,71,121 బకాయిలు వసూలు కావాల్సి ఉన్నాయి. ఒక్క కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బిల్లు రూ.1.60 లక్షలుగా ఉంది. ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు చెందిన బిల్లులు మరింత అధికంగా ఉంటాయి. హాస్టల్ వసతి ఉండడంతో ఫ్యాన్లు, లైట్లు, కంప్యూటర్లు తదితరాలు విరివిగా వినియోగిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు అందించడం, కొన్నిచోట్ల కంప్యూటర్ పనులు కొనసాగడం, బడులు ఉన్న రోజుల్లో తరగతి గదుల్లో ఫ్యాన్లు తిరుగుతుండడంతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి.

30 స్కూళ్లకు మీటర్లే లేవు..

91 పాఠశాలల్లో 30 స్కూళ్లకు అసలు విద్యుత్ మీటర్లే బిగించలేదు. అయినా బిల్లు మాత్రం ప్రతినెలా వస్తోంది. ఈ విషయమై విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే మీటర్లు లేనప్పుడు బిల్లులు రావని, గతంలోనే మీటర్లు ఏర్పాటు చేస్తే బిల్లులు వస్తాయని చెబుతున్నారు. కొన్నిపాఠశాలల్లో బడి బయట ఉన్న మీటర్లు చోరీకి గురయ్యాయని తెలుస్తోంది. పాఠశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు స్కూల్ గ్రాంట్స్ వస్తున్నా.. నిర్వహణకే సరిపోవడం లేదని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు నివేదిస్తాం



పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రతినెలా విద్యుత్ అధికారులు వసూలు చేసి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు ఉండేవి కావు. విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే భరించాలని పీఆర్‌టీయూ సంఘం తరఫున నివేదిస్తాం.

– ఆదే ప్రకాశ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నాగంపేట్, కన్నెపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి..

ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలుకు సీఎం నిర్ణయం తీసుకునే విధంగా కృషి చేయాలని కోరారు.

ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ



ఎంపీపీ విశ్వనాథ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతిని ఆదివారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఇళ్లకు చేరుకున్న వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, పార్టీ మండలాల అధ్యక్షులు ఆదే వసంత్‌రావు, డుబ్బుల వెంకన్న, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, కోఆప్షన్ సభ్యులు నాజీం, తదితరులు ఉన్నారు.

రోడ్లపైనే పశువులు..!



రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

రెబ్బెన: మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో రాత్రి పూట పశువులు రోడ్లపై సంచరిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు వాటిని పట్టించుకోకపోవడంతో సింగరేణి రోడ్డుపై తిష్టవేస్తున్నాయి. దీంతో కైరిగూడ నుంచి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గు సరఫరా చేసే లారీలతో పాటు, విధులకు హాజరయ్యే సింగరేణి కార్మికులు, ప్రజలు పశువులతో నానా తంటాలు పడుతున్నారు. పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జిని కలిసిన చౌహాన్ శ్రీనివాస్

నార్నూర్: కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాశ్ రాథోడ్‌ను ఆదివారం సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని ఏళ్లుగా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని సర్‌సిల్క్ నుంచి ప్రారంభమై మార్కెట్ ఏరియా, పెట్రోల్ పంపు మీదుగా సాగింది. కార్యక్రమానికి మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు బంగ్డియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 29న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న తహసీల్దార్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను ఆదివారం తహసీల్దార్ లలిత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లు తమ తప్పొఒప్పులను సరిదిద్దుకునేందుకు, మార్పులు చేర్పులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బూత్‌లెవల్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: నీట్‌లో ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు పొందిన పలువురు విద్యార్థులను సమత సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సమత కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రౌతు హిమని, నేహిత్, ముంజమ్ అర్మాన్‌లను సత్కరించారు. సంఘం ప్రతినిధులు మోహన్, సంతోష్, జనార్దన్, తిరుపతి, విస్తారు, గజానాన్, జయదేవ్, రాంచందర్, దేవాజీ, రవికుమార్, కేశవ్, సునీల్, సుమిత్రాబాయి, సంధ్య, సుజాత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ పోస్టులు గిరిజనులకే కేటాయించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఏజెన్సీ పోస్టులను గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంత పోస్టులను మైదాన ప్రాంత పోస్టులతో కలిసి మొత్తాన్ని మైదాన ప్రాంతంగా ప్రకటించడం సరికాదని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

బెజ్జూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రైతు సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు కుకుడా, అంబాగట్ట తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు యూరియా, డీఏపీ సకాలంలో అందించడమే కాకుండా ఎలాంటి కొరత లేకుండా ఉండేదన్నారు. ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు అందడం లేదని పేర్కొన్నారు. పంటలు నష్టపోతే నష్టపరిహారం సైతం ఇవ్వడం లేదన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు బుస శంకర్, నాయకులు రాజారాం తదితరులు ఉన్నారు.

చేతిపంపు ఇలా.. నీరు తాగేదెలా..?



కెరమెరి: మండలంలోని ఇందాపూర్ గ్రామంలో చేతిపంపు వద్ద మురుగు నీరు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చేతిపంపులో నీరు వస్తున్నప్పటికీ తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జ్వరాలతో బెంబేలు..!

- మురళీగూడలో మంచం పట్టిన 30 కుటుంబాలు
- పోతెపల్లిలో డెంగీ కేసు నమోదు
- ఆందోళన చెందుతున్న మండలవాసులు



మురళీగూడ గ్రామం



మురళీగూడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతుండడంతో మండలవాసులు బెంబేలెత్తుతున్నారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నా సీజనల్ జ్వరాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని జిల్లెడ గ్రామంలో వారం రోజులుగా గ్రామస్తులు జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. పోతెపల్లి గ్రామానికి చెందిన యువకుడికి డెంగీ నిర్ధారణ కాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మురళీగూడ గ్రామంలో సుమారు 30 కుటుంబాలకు చెందిన వారు జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆర్‌ఎంపీల దగ్గర చికిత్స పొందుతున్నారు.

ప్రబలుతున్న జ్వరాలు..

గత వారం రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో జ్వరంతో బాధ పడుతున్నారు. మండలవాసులు పెంచికల్‌పేట్ నుంచి కాగజ్‌నగర్ కి వైద్యం కోసం పరుగులు పెరుగుతున్నారు. కొందరు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీల వద్ద చికిత్స తీసుకుంటున్నారు. కాగా వైద్యాధికారులు, సిబ్బంది, వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు

పెంచికల్‌పేట్ పీహెచ్‌సీలో ప్రతీరోజు 60 నుంచి 70 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశాం. ప్రజలు జ్వరాలు వస్తే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్థానికంగా రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తాం.

– నేహా, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెంచికల్‌పేట్

ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

నేరడిగొండ: పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మాట్లాడారు.